# లోక విద్య ప్రపంచం

పక్షపత్రిక

బులెటెన్ - 1 జనవరి 1 - 2012 సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు వెల. రూ. 5

## ముందుమాట

పిల్లవాడు పుట్టిన వెంటనే పాలకోసం వాళ్ళ అమ్మదగ్గరకే వెళ్తాడు. అది ఆ బిడ్డ లోకజ్ఞానం. తరువాత తల్లిదండ్రులు సమాజంలో బ్రతకటానికి కావలసిన జ్ఞానాన్ని సమకూర్చుకునే ఏర్పాట్లు చేస్తారు. కొందరికి అది చదవటం, వ్రాయటం, కాగా మరికొందరికది పనిలో మెలుకువలు నేర్చుకోవటం. ఇదంతా కూడా సామూహికంగా మనమంతా ప్రకృతి ఒడిలో జీవిస్తూ సమాజానికి కావలసిన ఉత్పత్తులు, ఆలోచనలు, రాత, కోతలు చేయటం లేదా సమాజం కోసం మానవునికి సాధ్యం కానివాటి కోసం ప్రకృతేతర శక్తులను ప్రార్థించటం, వీరంతా కలిసి నేర్చుకున్న జ్ఞానాన్నే లోక విద్య అని, ఇది సమాజాభివృద్ధికి ప్రకృతితో సహజీవనానికి ప్రగాఢంగా విశ్వసించే సమాజ నిర్మాణ స్థాపనే 'లోక జన ఆందోళన'. వీరిలో రైతులు, వృత్తి విద్య చేసుకునే చేనేత కార్మికులు, చెక్క పనిచేసే వడ్రంగులు, బంగారం పనిచేసేవారు, ఇనుముతో పనిచేసే కమ్మర్లు, తోళ్ళ పనిచేసేవారు, ప్రకృతేతర శక్తులను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నంచేసే వారితో సహ వీరి సేవలను, వస్తువులను వినియోగదారులకు అందించే వ్యాపారులు, రవాణా కార్మికులు, ఇందులో అంతర్భాగమే. ఇది ఒక సంఘర్షణ లేని సమాజం. ఒకరితో ఒకరు మానవ సంబంధాలు నెలకొల్పుకొని అందరూ వ్యక్తి కోసం వ్యక్తి అందరికోసం జీవించే సమాజం.

దీని స్థానంలో మన ముందు అత్యంత ధనికుడిగా మారిపోవాలనే దానికోసం ప్రకృతిని ధ్వంసం చేసైనా మానవులను హింసించైనా, రక్తపాతాలు సృష్టించైనా, వ్యక్తిగత సంపద పోగు చేసుకోవటం ఈనాటి అభివృద్ధి నమూనా. కొద్ది తేడాతో అన్ని రాజకీయ పార్టీలు, రాజకీయాలు దాని చుట్టునే తిరుగుతున్నాయి. దానిలో భాగమే త్వరిత యాంత్రీకరణ, దానికి కావలసిన పెట్టుబడి సేకరణకే కంపెనీలు స్థాపన. వాటి ఉత్పత్తులతో మార్కెట్లకే చట్టాల రూపకల్పన, 'దీనిలో భాగమే' ఉత్పత్తి పెంచండి -అత్యధిక ధరకు అమ్ముకొండి. ఈ నమూనాలో ఎవరికి వారు తెలియకుండానే తమ ఉపాధికోల్పోవడం, హరిత విప్లవంతో మొదలై నేటి విదేశీ పెట్టుబడుల ద్వారా స్థానిక సూపర్ మార్కెట్ల నిర్వహణకు తలుపులు తెరవడం జరుగుతోంది.

ఉదహరణకు భారతదేశంలో ఒక అంచనా ప్రకారం 120 లక్షలు చిల్లర వ్యాపారం చేసే దుకాణాలు ఉన్నవి. వాటి ద్వారా సాలీనా 27,000 వేల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంది. దాదాపు 5 కోట్ల మంది జనం ఈ చిల్లర వ్యాపారం ద్వారా జీవనం సాగిస్తున్నారు. దేశంలో 2006లోనే రిలయన్స్, హెరిటేజ్ వంటి సంస్థలు చిల్లర వ్యాపారంలోకి ప్రవేశించడంతో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు మొదలవడం మనకు తెలిసిందే. ఈదేశంలో పనిచేసే చేతులకు కొదవలేదు. అయితే వాళ్ళ జీవనాధారమైన వృత్తులు, చిల్లర దుకాణాలు, కూరగాయలు, ఉల్లిపాయల తోపుడు బండ్లు, పాలుపెరుగు, అమ్ముకొనే మొదలైన వృత్తులలోకి బడా కార్పోరేట్ సంస్థలు, బహుళజాతి సంస్థల ప్రవేశాన్ని ప్రజా సంక్షేమమే పరమార్థమని ప్రకటించుకునే ఈ ప్రభుత్వాలు నిర్లిప్తంగా, నిస్సిగ్గుగా చూడనట్టు వ్యవహరించడం విస్మయం కలిగిస్తోంది. ఈ 5 కోట్ల మంది ప్రజలను వాళ్ళ వృత్తులనుండి దూరం చేస్తాయి. అంటే మనదేశంలో ఉన్న 5 కోట్ల ప్రజలకు నిరుద్యోగంతో పాటు కొనుగోలు శక్తి పోవడంతో పాటు నమ్మకమైన స్థానిక చిల్లర వ్యాపారస్తుడుస్థానే కనపడని కంపెనీలతో ఇక లావాదేవీలు మొదలవుతాయి. ఈ సందర్భంగా ముదాహవమైన అంశమేమిటంటే కాంగ్రెస్ పార్టీలో మిగిలి ఉన్న మానవతావాదులతో పాటు సంపూర్ణంగా మిగతా అన్ని రాజకీయ పార్టీలు, ఎన్.డి.ఎ, తృణముల్ కాంగ్రెస్, డి.ఎమ్.కె, బి.ఎస్.పి అన్ని వామపక్ష పార్టీలు మొదలైన వాటితో సహ అందరూ దానిని ప్రతిఘటించడమే. ఈ సందర్భంగా నష్టపోబోయే చిల్లర వ్యాపారులు అనేక చోట్ల దేశవ్యాప్తంగా తలో రోజు వ్యాపార బంద్‌కు పిలుపు నివ్వడం కూడా మనం చూస్తున్నాం.

ఈ సందర్భంలోనే దేశ వ్యాప్తంగా లక్షలాది సారవంతమైన భూములతో సహా ప్రభుత్వ స్థలాలన్నీ, దేవాలయ స్థలాలు, అడవులు, వివిధ కంపెనీలకు కట్టబెట్టడం దేశవ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేయడం గమనిస్తున్నాం. సెజ్‌లు, పోర్టులు, కోస్తా కారిడార్ల పేరుతో మనరాష్ట్రంలో మత్స్యకారులనందర్ని వారి వృత్తుల్ని హరించి వేయటాన్ని తలకొక సారి ప్రతిఘటించడం, ఆమేరకు ప్రభుత్వ యంత్రాంగం అంతా సాయుధ బలగాలతో కేంద్రీకరించి ఉద్యమాలను అణిచివేయడం చూస్తున్నాం. పెద్ద మిల్లులకు విచ్చలవిడిగా రాయితీలుయిస్తూ పురుగులమందులు ధరలు పెంచుకోవటానికి పారిశ్రామిక వేత్తలకు అనుమతినిస్తూ, నాసిరకం విత్తనాలవలన, పురుగుల మందుల వలన, ప్రత్తి దిగుబడి తగ్గిపోవడంతోపాటు, పెట్టుబడులు పెరగడంతో పత్తి రైతులూ, చేనేతరంగానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటినుండి క్రమేపి ప్రభుత్వ రాయితీలు తగ్గిస్తూ, నూలు మిల్లులతో కృత్రిమ తయారీ దుస్తుల దిగుమతితో కోట్లాది చేనేత రంగంలో వారు పనిలేక పస్తులుండాల్సిన పరిస్థితులతో, పత్తి రైతులు, నేత కార్మికులు వేలల్లో ఆత్మహత్యలు చేసుకున్నారు. దీనిని అక్కడక్కడ ప్రతిఘటించినా, పత్తిరైతులు చేనేత కార్మికులను పిట్టల్లాగ కాల్చడం కూడా మనం గమనించాం. వరి వ్యవసాయ పెట్టుబడులు రోజు రోజుకి పెరగడం, ప్రతికూల వాతావరణంలో నిలబడే సరైన ధరలు లభించక లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అక్కడక్కడా చేసిన ఉద్యమకారులను ఎప్పటికప్పుడు ప్రభుత్వం తన సర్వ బలగాలను సమీకరించి అణిచివేస్తోంది.

ఈ 'లోక విద్య' మీద ఆధారపడి జీవించే రైతుల, వృత్తికారుల చిల్లర వ్యాపారుల, కుటీర పరిశ్రమలన్నీ సంక్షోభం నుండి విముక్తి కావాలంటే ఎవరికి వారు, ఒంటరిపోరాటాలును చేయుడమేగాకుండా తమలాంటి బాధితులతో సంబంధ బాంధవ్యాలు పెట్టుకొని, ఒకరితో కొకరు కలిసి చర్చించుకొని ప్రతి ప్రాంతంలోను ప్రత్యామ్నాయం మార్గాలను అన్వేషించి ఐక్య ఉద్యమాలు నిర్మించుకోవటానికి సమాయాత్తం కావలసి ఉంది. వాల్‌మార్ట్ లాంటి బజార్ల ఎదురుగా సంఘటిత పోరాటం చేయాల్సి ఉంది. దీని నిర్మాణ భాగంగానే మొదటి అంతర్జాతీయ లోక విద్య సదస్సు సార్‌నాథ్, (వారణాసిల)లో నవంబర్ 12-14 తేదిలలో నిర్వహించడం జరిగింది. దీనిలో చర్చించి వివిధ సంస్థలతోను అనుసందానం చేయడానికి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగులో ఒక పత్రిక తీసుకురావటానికి నిర్ణయించడం జరిగింది. ఆ నిర్ణయంలో భాగంగానే ఈ 'లోకవిద్య ప్రపంచం' పత్రికను మీరి ముందుకు తీసుకు రావటం జరుగుతుంది. పత్రికను, పత్రిక లక్ష్యాలను విరివిగా ప్రచారం చేయటానికి పాఠకుల నుండి ఉద్యమ వార్తల రూపేణానూ, ఆర్థికంగానూ, విస్తృతంగా చందాదారుల్ని చేర్చటం ద్వారా సభ సమావేశాలు ఏర్పాటు చేయుటం ద్వారానూ, సహకారాన్ని కోరుతున్నాము.

**విద్య అంటే సమాజంలో అసమానతలను తొలగించేది.**

## 'లోకవిద్య' భారత ప్రభుత్వంచే నిర్ణయింపబడిన కనీస వేతన చట్టం అన్వయింపు

భారత ప్రభుత్వం వివిధ చట్టాల ద్వారా విద్య, వైద్య, కర్షక, కార్మిక ఉపాధి రంగాలలో పనిచేస్తున్న పౌరులకు కనీస వేతనాల్ని నిర్ణయించడం జరిగింది. ఈ వేతనాలను నైపుణ్యత, సాధారణ అర్హతల ఆధారంగా కూడా నిర్ణయించడం జరిగింది. అయితే ఈరోజు అనువంశికంగా వస్తున్న నైపుణ్యత కలిగిన, లోకవిద్యే ఆధారంగా జీవించిన కోట్లాదిమంది ప్రజానీకం తమ వృత్తుల నుండి నెట్టివేయబడి దుర్భర దారిద్ర్యానికి గురవడం మనం చూస్తున్నాం. వీరు వారి అనువంశిక వృత్తులలో నిష్ణాతులైనా కూలీకి మాత్రం మట్టిపని చెయ్యటానికి తయారుచేయటానికై కనీస వేతన చట్టం ఉపయోగిస్తోంది.

భారతదేశం వ్యవసాయక సామాజిక దేశంగా వేలాది సంవత్సరాలుగా ఎటువంటి ఆర్థిక ఒడిదుడుకులు పెద్దగా వ్యత్యాసాలు లేని సమాజంగా మనుగడ సాగించింది. యాంత్రికరణ ఒకవైపు భారతదేశంలోని చేతివృత్తులను ధ్వంసంచేస్తే, మరొకవైపు ప్రపంచీకరణ, విదేశీ దిగుమతులపై నియంత్రణను కోల్పోయి స్వదేశీ చిన్న పరిశ్రమలను మూయించి, అందులోని కార్మికులను బజారున పడవేసింది. భారతదేశ ఆర్థికవ్యవస్థకు వెన్నెముగా ఉన్న 'రైతు' సరళీకరణ విధానాల ద్వారా కుదేలయిపోయాడు. అభివృద్ధి చెందిన యూరోపియన్, అమెరికా దేశాలలో రైతులకు వ్యవసాయానికి సబ్సిడీలు పొందని భారత, లాటిన్ అమెరికా, మిగతా ప్రపంచ దేశాలు పోటీపడలేకున్నాయి. కల్తీ విత్తనాలు, నాసిరకం పురుగుమందులు, అత్యధిక రేట్లతో దొరుకుతున్న ఎరువులు, పెరిగిన వ్యవసాయ కూలీ, వచ్చిన పంటపై గిట్టుబాటు లేని ధరలు ఈ దేశ రైతులను ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నాయి. చివరకు భూమితల్లిని తరతరాలుగా నమ్ముకొని జీవిస్తున్న భారత రైతాంగం విధిలేని పరిస్థితులలో 'పంట విరామాన్ని' ప్రకటించవలసి రావడం అత్యంత విచారకరం. డబ్ల్యుటిఓ ద్వంద్వనీతి ప్రకారం అభివృద్ధి చెందిన దేశాలలో రైతాంగం పండించిన పంటకు మద్దతు ధర కలిగి ఉండగా, ప్రపంచ ప్రధాన వ్యవసాయ దేశమైన భారత్‌లో రైతులకు తను పండించిన పంటకు మద్దతు ధర లేదు.

భారతదేశ గ్రామీణ ఆర్థికవ్యవస్థ అతలాకుతలం కావడంతోనే వ్యవసాయ ఆధార జీవన వృత్తులుగా, అనూచానంగా వస్తున్న సాలె, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, గొల్ల, చాకలి, మంగలి, మత్స్యకారులు లాంటి వృత్తి నైపుణ్యమున్న కార్మికులు తమ ప్రమేయం లేకుండానే నిర్వాసితులుగా మిగిలిపోయారు. అయితే వీరెవరూ భారత ప్రభుత్వం 2005లో చట్టరూపమిచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిధిలోకి రారు. ఈ పథకం కేవలం 'శారీరక' శ్రమజీవులకు సంవత్సరానికి కనీసం 120 పనిదినాలు, వారి గ్రామీణ ప్రాంతంలో కల్పించి వారికి అమలులో ఉన్న వేతనాలను ఇవ్వడం కొరకు ఏర్పాటు చేయబడింది.

పారిశ్రామికీకరణ, ఆధునికీకరణ, సరళీకరణ - ఈ వృత్తినైపుణ్యత గల కార్మికవర్గాన్ని అనాథలుగా చేశాయి. వారెవరికి తమ వృత్తి పనులు తప్ప వేరే పనులు చేయగల సామర్థ్యం లేదు. ఇక రైతులతో పాటు భూమిని నమ్ముకొని గొఱ్ఱెలను, మేకలను పెంపకందారులైన కురుమ/గొల్లలకు తమ జీవాలను మేపుకునేందుకు పచ్చిక నేలలు లేకుండాపోయాయి. ప్రభుత్వాలు కార్పొరేట్లకు పరిశ్రమల పేర బదలాయిస్తున్న 'జరాయితి' భూముల లెక్క ఉందిగాని దానితోపాటు వేల ఎకరాల ప్రభుత్వ భూములు కట్టబెట్టడం గురించి ఎక్కడా చెప్పడం లేదు.

దీనితోపాటు గ్రామ పంచాయితీ చెరువులలో, నీటివాగులలో చేపలు పట్టుకు జీవించే మత్స్యకారులు చెరువుల ఆక్రమణ వల్ల, రసాయక ఎరువులు, పురుగుమందుల వాడకంతో కలుషితమైన నీటివాగులలో 'చేపజాతి' అంతరించడంతో జీవనాధారాన్ని కోల్పోయారు. ఫ్యాక్టరీలలో వ్యవసాయక పనిముట్ల తయారీ, గృహ అవసరాలకు 'స్టీల్' వాడకం కమ్మరి, కుమ్మరిని వృత్తి పనులకు దూరం చేశాయి. ఆధునిక వృత్తిపరమైన పరికరాలు చాకలి, మంగలిని దాదాపు నిరుద్యోగులుగా మార్చాయి.

వ్యవసాయాధారిత వృత్తులైన టోకు, చిల్లర ఆహారధాన్యాల ప్రజాపంపిణీ వ్యవస్థ సమాజంలో అంతర్భాగంగా ఉంటూ కోటానుకోట్ల కుటుంబాలకు జీవనాధారంగా ఉంటూ వచ్చింది.

అయితే ప్రపంచీకరణ నేపథ్యంలో దేశీయ, విదేశీయ కార్పొరేట్ సంస్థలకు ఈ దేశ చిల్లర వ్యాపారంలో ప్రవేశించడానికి వెనులుబాటు దొరకడంతో ఇప్పటికే ఈ రంగంలో వేళ్ళూనుకొంటున్న 'రిలయన్స్', 'హెరిటేజ్'లాంటి కంపెనీలకు తోడు పెద్ద పెట్టుబడులతో 'వాల్‌మార్ట్' లాంటి విదేశీ కార్పొరేట్ రిటైల్ సంస్థలు భారతదేశ చిల్లర వ్యాపారాల నిర్వహణను తమ ఆధీనంలో ఉంచుకోవడం కోట్ల కుటుంబాలు పనిలేనివారిగా తయారుచేసి దుర్భర దారిద్ర్యంలోకి నెట్టడమే.

ఈ దురవస్థ నుండి ఈ దేశ ప్రజలను కాపాడడానికి ఏకైక మార్గం ప్రజా నిరసన మాత్రమే. ఈ పనిని దేశంలో పనిచేస్తున్న వివిధ స్వచ్ఛంద సంస్థలు చేపట్టినప్పటికి ప్రజల నుండి ఆశించిన స్పందన అంతగా రావడం లేదు. కొత్తిమీర, కరివేపాకు లాంటి చిన్న వస్తువులను కూడా సూపర్‌బజార్లలో కొనడం ఫ్యాషన్‌గా మారిపోయింది. భారతదేశంలో వినియోగదారులు చిన్న వ్యాపారులు, మధ్య దళారీల దోపిడీకి గురవుతున్నారని గుర్తించిన అమెరికన్ బహుళజాతి రిటైల్ మార్కెట్‌ల సంస్థ'వాల్‌మార్ట్' భారతదేశంలో 'బెస్ట్‌ప్రైస్' మార్కెట్ అనే మారు పేరుతో ఈమధ్యే దక్షిణ భారతదేశంలో వ్యాపార కేంద్రమైన విజయవాడలో తన వ్యాపారాన్ని ప్రారంభించింది.

1962లో అమెరికాలో స్థాపించిన ఈ సంస్థ ఆ దేశ జనాభాలో 1/3 వంతు వినియోగదారులను కలిగి వుంది. ఈ బహుళజాతి సంస్థ చైనా, జపాన్, దక్షిణ అమెరికా దేశాలో కూడా తన వ్యాపార కేంద్రాలను ప్రారంభించింది. బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ ఆనాడు రైతులకు 'మదుపు' పెట్టి ఏరకంగా నీలిమందు, తేయాకు తోటలను ఈ దేశంలో సాగు చేయించిందో అదే విధంగా యీరోజు రైతుల ఆర్థిక పరిస్థితి ఆసరగా చేసుకొని అడ్వాన్సు రూపేణా అప్పులు ఇస్తూ ఏమేమి కూరగాయలు పండించి, ఏ రేటుకు ఆ కంపెనీకి అమ్మాలో ముందుగానే ఒప్పందం కుదుర్చుకుంటుంది. ఈ 'బెస్ట్ ప్రైస్'లో వినియోగదారుడు తక్కువ వెలకు నాణ్యమైన సరుకు కొనగలడని భ్రమపెడుతున్నది. వినియోగదారుడి శ్రేయస్సే తనకు ముఖ్యమని నమ్మబలుకుతున్నది. చిల్లర వ్యాపారాన్ని నాశనం చేసిన తర్వాత దాని విశ్వరూప ప్రదర్శన మోసాన్ని ఇప్పుడిప్పుడే వర్ధమాన దేశాలు కూడా గుర్తిస్తున్నాయి.

23.5 కోట్ల టన్నుల వివిధ రకాల ధాన్యాలు మనదేశంలో గ్రామీణ ప్రాంతంలో ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ధాన్యాల ఉత్పత్తికై 2 లేదా 3 పంటలు పండించడానికి కావలసిన నీరు భారీ నీటిపారుదల ప్రాజెక్టుల నుంచి లభ్యమవుతోంది. ఈ ప్రాజెక్టుల నిర్మాణంలోగాని, నిర్వహణలోగాని పెద్ద యంత్రాలు, పెద్ద కాంట్రాక్టర్లు, భారీ పరిశ్రమలలో ఉత్పత్తైన స్టీలు, సిమెంట్ అమిత ఖర్చుతో విపరీతంగా ఉపయోగిస్తున్నారు. ఈ పని చేయడానికి కోట్ల రూపాయల ధనాన్ని వెచ్చించగలిగే పెట్టుబడి పెట్టగలిగే పెద్ద కాంట్రాక్టర్లు ఈ నీటిపారుదల వ్యవస్థని శాసిస్తున్నారు. ఇక విత్తనాలు ఉత్పత్తి చేసే సంస్థలు శాస్త్రజ్ఞులను పెద్ద కమతాలను, పెద్దపెద్ద పరిశోధన కేంద్రాలను నిర్వహించడానిక కూడా కోటీశ్వరుడైన పెట్టుబడిదారుడే ప్రముఖ పాత్ర వహిస్తున్నాడు. ఈ హైబ్రిడ్ విత్తనాల కోసం భూగర్భ జలాలను వందల మీటర్ల నుంచి లాగేయడానికి కావలసిన యంత్రాలు, విద్యుచ్ఛక్తి పెద్ద పెట్టుబడిదారుల వల్లనే సాధ్యపడుతోంది. ఇక ఎరువులు, పురుగుల మందులు కూడా విపరీతమైన నీటితో పాటు విస్తృతంగా ఉపయోగించడానికి పెద్ద పెట్టుబడిదారులే దిక్కవుతున్నారు. పండించిన పంటలను రవాణా చేయడానికి, నిల్వ చేయడానికి తగిన మార్కెట్ చేయడానికి భారీ వాహనాలు, విశాలమైన రోడ్లు, పెద్దపెద్ద గోడౌన్‌లు ఇవన్నీ కూడా కోటీశ్వరులచే నిర్మింపబడి నిర్వహించబడుతూ ఉన్నాయి. రైతు వ్యవసాయ భూమిపై నియంత్రణ ఉండగా, కోటీశ్వరుల ఆస్తులపై లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే మన వ్యవసాయరంగం గ్రామీణ ప్రాంతంలో ఉన్నప్పటికీ దానిని నిర్దేశిస్తున్నది ఈ కోటీశ్వరులు, నియంత్రిస్తోంది పెట్టుబడిదారుల సమూహమే. వీరు ప్రశేశపెట్టిన విలువలు, విధానాలు గ్రామీణ ప్రాంతపు జీవితాలను చిన్నాభిన్నం చేసేస్తున్నాయి. ప్రాజెక్టు, కాలువ మొదటి భాగంలో ఉండే వారందరూ రెండు, మూడు పంటలు పండించి కాలువల చివరి వరకు నిర్మాణాన్ని, నిర్వహణను అడ్డుపడటంతో పాటు నీరు రైతులకు సమంగా అందడం లేదు. వారికి వ్యవసాయం మొదటిమెట్టుగా పెట్టుబడిదారుడవటానికి మాత్రం ఉపయోగపడుతోంది. కాలువ చిర భాగంలో ఉన్నవారు చెరువుల కింద వ్యవసాయం చేసేవారు, ఎల్లప్పుడూ ప్రకృతి మీద ఆధారపడి వ్యవసాయాన్ని ఈడ్చుకొస్తున్నారు. వీరు ఏ ఉద్యమం చేసినా సమాజంలో గుర్తింపు కూడా ఉండదు. వ్యవసాయం పై పెట్టుబడిని పారిశ్రామికవేత్తలు పెంచుతూ పంటలకు నిల్వచేసుకోలేని చిన్న, సన్నకారు రైతులు తమ పంటను తెగ నమ్మేకొని కనీసావసరాలకు కూడా చాలని ధరలకే అమ్ముకునే పరిస్థితిని ఈ పారిశ్రామికవేత్తలే నిర్దేశిస్తున్నారు. కాని కాలువ/ప్రాజెక్టు మొదటనున్నటువంటి రైతులు వారి పెట్టుబడులతో అదనపు లాభాలతో ఈ రోజు చిన్న ఉద్యమాలను కూడా ఉద్యమాలుగా నేటి ప్రసార మాధ్యమాల ద్వారా చూపించగలుగుతున్నారు. ఈ విధంగా వ్యవసాయం మీద మాత్రమే ఆధారపడిన 73% ప్రజలను పారిశ్రామికవేత్తలు బతకనివ్వడం లేదు.

భారతదేశ నైసర్గిక పరిస్థితిని బట్టి నూలువస్త్రాలు, వేసవి కాలంలో చల్లగాను, శీతాకాలంలో వెచ్చగానూ ఉండడానికి దోహదపడతాయి. అందుచేతనే భారతదేశంలో తిండిగింజల తర్వాతి స్థానం ప్రత్తిది, చేనేతది. ఈ రంగంలో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సుమారు 5 కోట్ల మంది పైగా ప్రత్తి పండించడంలో నేత నేయడంలో బట్టల వ్యాపారంలో ఈరోజున కూడా జీవిస్తున్నారు. పట్టణ ప్రాంతంలో ప్రభుత్వ మరియు కార్పొరేట్ రంగ కార్యాలయాల్లో, ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రత్తిరైతులు, చేనేత వృత్తికారులతో సహా అందరూ చౌక ధరలలో వచ్చే కృత్రిమ బట్టలు కోట్లకు పడగలెత్తిన పెట్టుబడిదారులచే నడపబడుతున్నాయి. ఇక విద్యారంగానికొస్తే గ్రామీణ ప్రాంతపు జీవనాన్ని ఆర్థిక స్వయంప్రతిపత్తి కోసం పనికివచ్చే చదువులు స్థానే వ్యక్తిగతంగా అధికారం అనుభవించటానికి, ధనాన్ని పోగు చేసుకోవడానికి ప్రాధాన్యతనిస్తూ భారతీయ జీవన విధానాన్ని, గ్రామీణ ప్రాంతాన్ని చిన్నబుచ్చే మానవత్వపు విలువలు లేని సంపద కేంద్రీకృతం అయ్యే చదువులు ముఖ్యంగా ఆంగ్లంలో నేర్పబడుతున్నాయి. తరతరాల నుంచి వచ్చే వృత్తులను అభివృద్ధిపరచడానికి దానిలో పరిశోధించటానికి వాటికి అనుసంధానంగా విద్యలు ఏనాడూ ఆంగ్ల మాధ్యంలో నేర్పబడలేదు. ప్రాంతీయ భాషల్లో నడిచే పాఠశాలల్లో కొంత కాలం నేర్పబడినా పెట్టుబడిదారులచే నడపబడే ఆంగ్ల మాధ్యమ పాఠశాలలే ఈరోజు మార్గదర్శకాలు. మన దైనందిన జీవనానికవసరమైన వ్యవసాయం, చేనేత మొదలైనవారు అందరూ వారి అనువంశిక వృత్తులకు సంబంధించి చదవటం కాని, పరిశోధించటానికి కావల్సిన చదువు చదవకపోటంతో మన విద్యావిధానం పూర్తిగా పారిశ్రామికీకరణానికి ఉపయోగించటానికే ఉపయోగపడుతుంది.

ఈ విధంగా భారీ పరిశ్రమలు, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు ఆంగ్ల మాధ్యమం, వ్యక్తిగత సంపాదనా ధ్యేయంతో మానవ విలువలను అణగద్రొక్కుతూ నీళ్ళ కోసం, డబ్బు కోసం అన్నదమ్ములను, తల్లిదండ్రులను హత్యలు చేసే లేదా విసర్జించే నూతన సమాజ నిర్మాణం ప్రపంచీకరణ పేరుతో మనదేశంలో ఈనాడు అమలు జరుగుతోంది. దీనివల్ల వ్యవసాయం పై ఆధారపడిన రైతులు చేతివృత్తులు, చేనేత పై ఆధారపడి కార్మికులు ఆంగ్లభాషలో ఉన్నతవిద్యలు అభ్యసించి, అధికారగణంలో పెట్టుబడిదారి వర్గంలో జాడలేని నిరుద్యోగులతో మనదేశం ఒకప్రక్క కునారిల్లుతోంటే మరోప్రక్క కోటీశ్వరుల సంఖ్య పెరుగుతూ పోతోంది. అదే సమయంలో ఆత్మహత్యలు, నిరుద్యోగుల వల్లనైతేనేమి, రైతుల వల్లనైతేనేమి, చేనేతరంగ కార్మికుల వల్లనైతేనేమి పోయిన దశాబ్దంలో సుమారుగా 3 లక్షలు సంభవించాయి.

**దీనికి ప్రత్యామ్నాయం ఏమిటి ?**

చిన్నతరహా నీటి వనరుల నిర్మాణానికి, నిర్వహణకి తక్కువ పెట్టుబడి త్వరితగతిన పూర్తవడంతో పాటు, ప్రాంతాల మధ్య సంఘర్షణలు ఉండవు. పెద్ద యంత్రాల బదులు విశాలమైన మానవ వనరులను మన భారతదేశంలో వీటి నిర్మాణంలోను, నిర్వహణలోను విస్తృతంగా ఉపయోగిస్తే గ్రామీణ ప్రాంతంలో వారికి కొనుగోలు శక్తి పెరుగుతుంది. ముఖ్యంగా పెద్ద, చిన్న రైతులనే వర్గ భేదాల నిర్మూలనకు ఉపయోగిస్తుంది. తారతమ్యాన్ని తగ్గిస్తుంది.

అదేవిధంగా భారతీయులు అందరూ నూలువస్త్రాలు ధరిస్తే వారికి అవసరం తీరటంతో పాటు ప్రత్తి రైతులకు, చేనేత కార్మికులకు, వాటికి సంబంధించిన కమ్మరి, చాకలి మొదలైన శాఖలకు తగిన ఉపాధి దొరకడంతో పాటు గ్రామీణ ప్రాంతంలో కొనుగోలు శక్తి పెరుగుతుంది. నిరుద్యోగ నిర్మూలన జరుగుతుంది. పెద్ద యంత్రాల స్థానే అనేక చిన్న యంత్రాలతో ఎక్కువ మానవ వనరులను ఉపయోగించే దిశగా పరిశోధనలు కూడా ప్రారంభం కావాలి.

ఈరోజు పెద్ద ఎత్తున భూసేకరణ జరుగుతోంది. సేకరించిన భూములన్నీ కూడా పెద్ద పెట్టుబడిదారులు పారిశ్రామికీకరణకు కావల్సిన భారీ నీటి ప్రాజెక్టులు, థర్మల్, అణు విద్యుత్ కేంద్రాల కోసం, పెద్ద పెట్టుబడులతో ఫ్యాక్టరీలు, మార్కెట్టులు, రవాణా సముద్ర (నీటి మార్గంలోనూ, భూమ్మీదా) దారుల నిర్మాణం కోసం సేకరించడటం జరుగుతోంది. ప్రత్యామ్నాయంగా ఉన్న విద్యుత్ ఉత్పత్తి (సూర్యరశ్మితో, గోబర్‌గ్యాస్‌తో, గాలిమరతో, సముద్ర తరంగాలతో, కాల్వనీళ్ళతో తయారయ్యే చిన్న విద్యుత్ పరిశ్రమల స్థాపనలతో) మార్గాల మీద పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడితే, స్థానికంగా ఉద్యోగాలతో పాటు పశుసంపద పెరిగి, అడవులు పెరిగి ప్రకృతి విధ్వంసం తగ్గుతుంది.

ఈ నూతన అభివృద్ధి నమూనాలో ధన కేంద్రీకరణ, ధనం కోసం ధనం వల్ల జరిగే అక్రమాలు, అత్యాచారాలు, హత్యలు, ఆత్మహత్యలు ఆగిపోతాయి. మానవ విలువలు పెరిగి పేద-ధనిక వర్గాల మధ్య తేడాలు తగ్గుతాయి.

ఈ విధానం ప్రవేశపెట్టడానికి ఉన్న మానవ వనరులన్నిటిని ఉపయోగించుకోవటానికి, ప్రతీ యువకుడికి తన సామర్థ్యం మేరకు తనకు చేతనైన పనిచేసే హక్కు కల్పించి కనీస వేతనాలివ్వటంతోనే దానికి శ్రీకారం చుట్టాలి. పార పలుగు పనులకు మాత్రమే పనిచ్చే ఈ కనీస వేతన చట్టాన్ని అందిరికి అన్ని విద్యలవారికి అందుబాటులోకి తేవాలి. ప్రకృతితో సహజీవనం కోసం, మానవ విలువల కోసం, ప్రపంచశాంతి కోసం మేధావులు ఈ దిశలో ఆలోచించటం మొదలెట్టాలి.

**వ్యక్తిగతంగా మనమేం చేయాలి!**

పారిశ్రామిక వస్తువుల ధరల నిర్ణయం ఎలా జరుగుతోందో గమనించి అదే పద్ధతిలో వ్యవసాయ, చేతివృత్తుల, చిన్న కుటీర పరిశ్రమల ఉత్పత్తులకి అదనపు విలువ జోడించి ఖరీదు చేయడం వల్ల గ్రామీణ ప్రాంత పునరుజ్జీవనానికి నాంది పలకాలి.

వ్యవసాయ భూమి కుటుంబానికి 18 ఎకరాల పల్లం, 36 ఎకరాల మెరకగా నిర్ణయింపబడింది. దాని ఖరీదు సుమారు రూ. 20 నుండి 30 లక్షల లోపే అందుచేత 30 లక్షల రూపాయల పైబడిన ఉత్పత్తి సాధనాల మీద యాజమాన్యం సామాజికపరం చేయాల్సిన అవసరాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి. ధాన్యం ఉత్పత్తి ధరకు అదనపు విలువ ఏ శాతం చెల్లిస్తారో అదే శాతం పారిశ్రామిక ఉత్పత్తుల గరిష్ఠ ధరగా చెల్లించాలి. మానవీయ విలువలతో కూడిన పుస్తక పఠనం, ప్రచురణ, సమావేశాలు, ప్రదర్శనలు ఏర్పాటులో తోడ్పడాలి. పునరుత్పత్తి చేయలేని ప్రకృతి సంపదను ఖర్చు చేసే వస్తు వినిమయం పూర్తిగా తగ్గిస్తూ మానే దిశగా ప్రయాణించాలి. ప్రభుత్వ వైద్య విద్యాలయాల్ని, చదువుకున్నవారు, ధనికులు, అధికారులు ఉపయోగించటంతో పాటు ప్రైవేటు వైద్య విద్యాలయం ఖర్చులు ప్రత్యక్షంగా కాని, పరోక్షంగాగాని ప్రభుత్వం చేయటాన్ని నిరసించాలి. పూర్తిగా నిషేధించాలి.

గ్రామీణ ప్రాంత ఉత్పత్తులను, చిన్న కుటీర పరిశ్రమల ఉత్పత్తులను కొనటంతోపాటు చేనేత వస్త్రాల వినియోగించటం ప్రభుత్వోద్యోగులు అధికారులు, రాజకీయనాయకులు అదే పద్ధతిని పాటించే వరకూ ప్రస్తుత రాజకీయ నాయకులపై ఒత్తిడి తేవాలి.

పెద్ద ప్రాజెక్టులను, పెద్ద పరిశ్రమలను, భూసేకరణను వ్యతిరేకిస్తూ ప్రచారం చేయాలి.

ఆఖరుగా లోకవిద్య ఆధారిత ఉత్పత్తులకు చెల్లించే సొమ్ము ప్రత్యక్షంగానో, పరోక్షంగానో గ్రామాలకు చేరుతుందనే విషయాన్నీ ప్రతీక్షణం ఖర్చు చేసే సమయంలో గుర్తించాలి.

**ఐ. నాగేశ్వరరావుతో**
**టి. నారాయణరావు**

**(3వ పేజి తరువాత)**

వ్యవసాయ రంగంలో దాదాపు 80 శాతం నుంచి చిన్న, సన్నకారు రైతులతో పాటు కౌలుదారులు కూడా లెక్కకుమించి ఉన్నారు. క్రాఫ్‌హాలిడే ప్రకటించడంవలన ఎక్కువగా నష్టపోయేది వీరే. వీరితోపాటు వ్యవసాయ కూలీలు మరింత నష్టపోతున్నారు. వ్యవసాయాన్ని ఆలంబనంగా చేసుకొని జీవనయానం సాగిస్తున్న అనేక చేతి వృత్తుల వారు నష్టపోతున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో 2009-10 సంవత్సరానికి 104 లక్షల టన్నులు ఉత్పత్తి 2010-11 సంవత్సరానికి 140 లక్షల టన్నులకు పెరిగింది. ఉత్పత్తి అయితే పెరిగిందిగాని దానికి తగిన మార్కెట్టు, మద్దతు ధర కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. రైతులు దాదాపు 1.20 లక్షల ఎకరాలలో క్రాఫ్‌హాలిడే ప్రకటించిన తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కంటి తుడుపు చర్యగా ప్రభుత్వ మాజీ ప్రధానకార్యదర్శి శ్రీ మోహన్‌కందాతో ఒక కమిటీ వేశారు. ఆకమిటీలో ఒక్క రైతుకుగాని, రైతు నాయకుడికిగాని ప్రాతినిధ్యం యివ్వలేదు. ఆ కమిటీ కూడా ప్రత్యామ్నాయాలు సూచించడంలో విఫలమైంది. ప్రభుత్వం పండించిన పంటను నిల్వ చేయటానికి కావలసిన సంచులను కూడా సరఫరా చేయడంలో విఫలమైంది. 140 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తిలో ఎఫ్.సి.ఐ. 9.1 లక్షల టన్నులు సేకరించాల్సి ఉండగా కేవలం 7.6 లక్షల టన్నులు మాత్రమే సేకరించింది. ఈ క్రమంలో రైతులు ఎకరానికి తమ ఉత్పత్తి వ్యయంమీద 2,200 నుండి 3,600 నష్టపోవడం వలన రైతులు దిక్కుతోచని పరిస్థితులతో తాను మరింతగా నష్టపోకుండా క్రాఫ్‌హాలిడే ప్రకటించారు. ఈ క్రాఫ్‌హాలిడే కేవలం ఉభయగోదావరి జిల్లాలకే పరిమితం గాకుండా ప్రకాశం, ఖమ్మం, కడప జిల్లాలకు చెందిన రైతులు కూడా 'క్రాఫ్‌హాలిడే' దిశగా అడుగులు వేస్తున్నారు. తరుచు అతివృష్టి, అనావృష్టికి గురై పంటలు నష్టపోతున్న రైతులకు తాము సక్రమంగా పంట చేతికి అందించాలనే దిశలో గిట్టుబాటు ధర లేకపోవడం రైతులు తప్పనిసరి పరిస్థితులలో క్రాఫ్‌హాలిడే దిశగా అడుగులు వేశారు, వేస్తున్నారు.

**- ఎ. అప్పారావు**

# చేనేత రంగం - లోకవిద్య ఆవశ్యకత

భారతదేశంలో వ్యవసాయరంగం తర్వాత రెండవ ఉపాధి కల్పనారంగం చేనేత. బ్రిటీష్ కాలం నుంచి చేనేత రంగం వివిధ రూపాలలో సంక్షోభాలకు గురయి లక్షలాది చేనేత కార్మికులు ఆకలి చావులకు బలైన సంఘటనలు చరిత్ర పుటలలో లిఖించబడ్డాయి. అయినా దేశభక్తి ఉద్యమాలతోపాటు చేనేత రంగాన్ని కాపాడుకునే లక్ష్యంతో చేనేత కార్మికులు చేసిన పోరాటాల చరిత్రను కూడా చరిత్రకారులు గుర్తించారు. ఈ పోరాటాలు స్వాతంత్రోద్యమానికి మరింత బలాన్ని చేకూర్చటమేగాక కులాల మధ్య, మతాలమధ్య, జాతులమధ్య ఐక్యతను పెంపొందించి స్వాతంత్రోద్యమంలో చేనేత పరిశ్రమను రక్షించుకోవడంతోపాటు దేశీయ పరిశ్రమలను కాపాడుకోవాలనే నినాదం ముందుకొచ్చింది. ఆ దిశలో భాగంగానే "విదేశీ వస్త్రబహిష్కరణ - ఖాదీ వస్త్రధారణ" నినాదం, ఖాదీ పరిశ్రమల ప్రోత్సాహం అనే అంశాలు 1919 నుండి స్వాతంత్ర్యం సిద్ధించేవరకు జాతీయ కాంగ్రెస్ మహాసభలలో ప్రత్యేక అంశాలుగా చర్చించబడ్డాయి.

స్వాతంత్ర్యానంతర కాలంలో చేనేత పరిశ్రమ అభివృద్ధిని కాంక్షించిన స్వాతంత్ర్యయోధులకు, చేనేత వర్గాల వారికి మన పాలకుల విధానాలు నిరాశను మిగిల్చాయి. దీని ఫలితంగానే మొట్టమొదటిసారిగా 1951 మే నేలలో బాపట్ల తాలూకా పందిళ్ళపల్లి గ్రామమందు చేనేత కార్మికుని ఆకలిచావు సంభవించి కేంద్ర ప్రభుత్వం గుర్తించటం జరిగింది. ఈ ఆకలి చావుల నివారణకు, కార్మికులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో అప్పుడు మొదలైన గంజి కేంద్రాలు, నూలు సరఫరా కేంద్రాలు ఇప్పటికీ కొనసాగుతుండటం బట్టి చేనేత కార్మికుల దీనస్థితి 6 దశాబ్దాలకాలంలో ఏ మాత్రం మార్పు లేకుండా ఆకలి అనారోగ్య చావులకు, ఆత్మహత్యలకు బలిచేస్తునే ఉన్నాయి మన దేశ పాలకుల విధానాలు.

1991 నుండి అమలవుతున్న ఆర్థిక సంస్కరణల పుణ్యమా అంటూ ప్రవేశపెట్టబడిన ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు దేశీయ పరిశ్రమలన్నింటిని సర్వనాశనం చేశాయి. ఈ విధంగా దెబ్బతిన్న పరిశ్రమలలో కుటీరపరిశ్రమ అయిన చేనేత రంగం ప్రధానమైనది. 1985 సం॥ నాటికి ఉన్న 48 లక్షల మగ్గాల సంఖ్య 1991 నాటికి 43 లక్షలకు తగ్గింది. ఒక్క 10 సం॥ల కాలవ్యవధిలోనే 10 లక్షలకు పైగా మగ్గాల సంఖ్య తగ్గి 30 లక్షల మంది కార్మికులకు ఉపాధి లేకుండా వీధులపాలు చేశాయి కేంద్ర ప్రభుత్వ జౌళి విధానాలు 2004 జనవరి 1 నుండి అమలవుతున్న ప్రపంచ వాణిజ్య సంస్థ షరతులకు లోబడి భారతదేశం చేసుకున్న ఒప్పందం మేరకు అమలవుతున్న జౌళి విధానాల వలన 2004-10 మధ్య కాలంలోనే 10 లక్షల మగ్గాల తగ్గినట్లు 2010 హ్యాండ్లూమ్ సెన్సెస్ ద్వారా కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దీనిని బట్టి భారతదేశంలోని మగ్గాల సంఖ్య 15 సం॥ల కాలవ్యవధిలో 20 లక్షల మగ్గాలపైగా తగ్గి 60 లక్షల కార్మిక కుటుంబాలు ఉపాధి కరువై వివిధ వృత్తులలోకి వలసలబాట పట్టాయి. తల్లి గర్భంలో గర్భస్థ శిశువును దాచుకున్నట్లుగా భూమి తల్లి వ్యవసాయ రంగంపై ఉపాధి కల్పించింది. కాని అభివృద్ధి పేరుతో జరుగుతున్న పారిశ్రామిక పార్కులు, టెక్స్‌టైల్ పార్కులు, ఐటి పార్కులు, అణుధర్మల్ పవర్ ప్రాజెక్టులు పేరుతో స్పెషల్ ఎకనమిక్ జోన్స్‌కు పంటకు అనువైన భూములన్ని ధారాదత్తమై నేడు వ్యవసాయరంగం పూర్తి సంక్షోభంలో ఉంది. దీనికి తోడు ఎరువులు పురుగు మందుల ధరలు అధికమై పండిన పంట దిగుబడులకు గిట్టుబాటు ధరలేక లాభసాటిలేని వ్యవసాయ రంగానికి రైతులు పంట విరామాన్నే ఒక ఉద్యమరూపంగా తీసుకునే స్థితికి మన దేశ దుస్థితి చేరింది. అంతేకాక ఆహార ద్రవ్యోల్బణం 12.21% పెరిగి పేదలకు ఆహారం కొరత ఏర్పడింది.

వ్యవసాయాధార పరిశ్రమైన చేనేత రంగం కూడా ప్రత్తి నూలు, సిల్కు నూలు కొరతలతో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనక తప్పలేదు. జౌళిశాఖవారి లెక్కల ప్రకారం జనవరి 2009లో రూ. 109/కేజి ఉన్న కాటన్ హ్యాంక్ యారన్ ఆగష్టు 2010 నాటికి రూ. 150/కేజికు పెరిగింది. ఇది సుమారు 38% శాతం ధర పెరుగుదలను కేవలం 20 నెలలో జరిగిన పెరుగుదలగా గుర్తించవచ్చు. అదే విధంగా ఫిలేచర్ సిల్క్ యారన్ 2008లో రూ. 1575/కేజి కాగా 2010 నాటికి రూ. 2052/కేజికు పెరిగింది. చరఖా సిల్కు యారన్ 2008లో రూ. 1585/కేజి కాగా 2010 నాటికి రూ. 1800/కేజికు పెరిగింది. దీనిని బట్టి 30 శాతం పెరుగుదలను రెండు సం॥ల కాలంలో గమనించవచ్చు.

ఒక్క ప్రక్క చేనేతలకు కావలసిన నూలు ధరలు (సిల్కు, కాటన్, ఊల్, జరీ) పెరుగుదల, మరోప్రక్క చేనేతలకు ప్రాణాధారమైన హ్యాంక్‌యారన్ ఉత్పత్తి తగ్గుదల పరిశ్రమను పూర్తిగా దెబ్బతీశాయి. 50% హ్యాంక్ యారన్ తయారు చేయాలనే నిబంధన ఉన్నప్పటికి స్పిన్నింగ్ మిల్లులు 1999 - 2000 సం॥లో 26.3% (మొత్తం ఉత్పత్తి 2183 మి.కేజిలు కాగా హ్యాంక్ యారన్ 574 మి.కేజిలు మాత్రమే) 2004-05 సం॥లో 18.5% హ్యాంక్ యారన్‌ను (2377 మి.కేజిలు. మొత్తం ఉత్పత్తి కాగా 440 మి.కేజిలు హ్యాంక్ యారన్), ఇదే విధంగా 2007-08 18.12% కాగా (2951 మి.కేజిలు కాగా 535 మి.కేజిలు హ్యాంక్ యారన్) ఉత్పత్తి చేస్తూ హ్యాంక్ యారన్ ఆబ్లిగేషన్ చట్టాన్ని స్పిన్నింగ్ మిల్లులవారు ఉల్లంఘిస్తున్నారు. 2010 ఏప్రియల్ జూన్ మధ్యకాలంలోనే 18.54 మి.కేజిల హ్యాంక్ యారన్ ఉత్పత్తి కొరతలో భారతదేశంలోని చేనేత పరిశ్రమ అతలాకుతలమయింది. ఇదే విధంగా మన దేశంలో సిల్కు యారన్ ఉత్పత్తి అవసరాలకు 27000 మెట్రిక్ టన్నులు సిల్కు అవసరం కాగా కేవలం 18 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతూ, రా సిల్కు, సిల్కు దారం రూపేణా 4 వేల మెట్రిక్ టన్నుల వరకు విదేశీ ఎగుమతికి అనుమతిస్తున్నారు. దీని ఫలితంగా భారతదేశంలోని సిల్కుచేనేత కార్మిక వర్గమంతా సుమారు 13 వేల మెట్రిక్ టన్నులు సిల్కు యారన్ కొరతతో సతమతమవుతూ చైనా నుండి స్మగుల్డ్ గూడ్స్‌గా మార్కెట్ అవుతున్న సిల్కు యారన్‌పై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. ఈ విషయాన్ని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ 1997-98 రిపోర్టులో నిర్ధారించి, చైనా నుండి సిల్కును దిగుమతి చేసుకొనుట కోసం వాణిజ్యశాఖ చర్యలు తీసుకోవాలని సూచించినప్పటికి 1 1/2 దశాబ్ద కాలం గడుస్తున్నను కేంద్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోనందున భారతదేశం సిల్కు పరిశ్రమ సంక్షోభంలో నెట్టబడి సిల్కు వస్త్ర మార్కెట్ పోటీ తట్టుకోలేక కర్ణాటక, యూపి, బీహార్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, అస్సాం రాష్ట్రాలలోని సిల్కు చేనేత కార్మిక వర్గం రోజువారీ ఉపాధిలేక ఇబ్బందులకు గురి అగుచున్నారు.

టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ ఫండ్ పేరుతో పవర్ లూమ్స్ మరియు మిల్ సెక్టారుకు 2,07,350 కోట్ల రూపాయలు జాతీయ బ్యాంకుల ద్వారా రుణాలందించి 67,221 కోట్ల రూపాయలను సబ్సిడీగా 2001-10 సం॥ మధ్యకాలంలో సబ్సిడీని కేటాయించి చేనేతలకు మాత్రం 2004 నుండి సబ్సిడీ పథకాలే లేకుండా చేసింది. ఇదే విధంగా 1997-98 సం॥లో మొత్తం జౌళిరంగం బడ్జెట్‌లో 27.5% ఉన్న చేనేత రంగం వాటా 2010-2011 నాటి 6.6% కి తగ్గింది.

రాష్ట్ర చేనేత జన సమాఖ్య చేసిన ఉద్యమాల ఫలితంగా 2011-2012 ఆర్థిక సం॥రానికి 7.37%ని టెక్స్‌టైల్ బడ్జెట్‌లో చేనేత వాటా పెరిగినప్పటికి అతి స్వల్పం మాత్రమే.

భారతదేశంలో 3వ చేనేత మగ్గాల గణనన 2009-10 ప్రకారం 40 లక్షల కార్మికులకు పైగా 23.77 లక్షల మగ్గాలపై జీవనోపాధి పొందుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వీరిలో మగ్గాలపై ఇతర ఉత్పత్తులపై ఆధారపడి 38.47 లక్షల మంది ఉన్నారని వీరిలో 8.48 లక్షల మగవారు, 29.98 లక్షల మహిళలు చేనేత రంగంపై జీవించుచున్నారు. అదే విధంగా 3.90 లక్షలు యస్.సి.లు., 6.97 లక్షల యస్.టి.లు, 17.38 లక్షల ఓ.బి.సి.లు, 10.22 లక్షల ఇతర ముస్లిం మైనారిటీలు చేనేత రంగంపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. వీరిలో ఎక్కువ మంది ప్రైవేటు మాస్టర్ వీవర్స్ వద్ద పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. దేశంలో చేనేత ప్రాథమిక సహకార సంఘాలు 21765 ఉన్నప్పటికి పనిచేస్తున్నవి 13,057 మాత్రమేనని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నవి. కేవలం 15% కార్మికుల మాత్రమే సహకార వ్యవస్థలో పనిచేస్తున్నారు. దీనికి కారణం నాబార్డు సంస్థ నుండి నా బార్డు క్రెడిట్ రీఫైనాన్స్ స్కీమ్ నుండి నిధులు సహకార సంఘాలకు నిబంధనల మేరకు అందించకపోవడమే 1999 - 2000 ఆర్థిక సం॥లో 8087.42 కోట్ల రూపాయలు మంజూరు చేయగా 2009-2010 నాటికి 177.32 కోట్ల రూపాయలు మాత్రమే మంజూరు చేసి ఉపాధి కల్పనలో రెండవ ప్రధాన రంగమైన చేనేతను నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 7 వేల మి. స్క్వేర్ మీటర్ల వస్త్ర ఉత్పత్తి చేస్తున్న చేనేత రంగం సుమారు 42 వేల కోట్ల రూపాయల వ్యాపారం టర్నోవర్ చేస్తున్నది. ఇది కేవలం మీటరు వస్త్రం ధర రూ. 60/-లుగా వేసిన అంచనా మాత్రమే. వాస్తవానికి కాటన్, సిల్కు, ఊలు వస్త్ర ఉత్పత్తుల సగటు ధరను మీటరుకు రూ. 100/-లు తగ్గకుండా వేయవచ్చు. అలా అంచనా వేస్తే భారతదేశంలో చేనేత వస్త్ర ఉత్పత్తి అమ్మకాల వార్షిక టర్నోవర్ 70 వేల కోట్ల రూపాయలు అవుతుంది. దీనిలో 4వ వంతు అనగా 17.5 వేల కోట్ల రూపాయలు నాబార్డు క్రెడిట్ రీఫైనాన్స్ సౌకర్యం క్రింద నిధులు సమకూర్చాల్సిన బాధ్యత ఉంది. కాని మన దేశపాలకుల నిర్లక్ష్య వైఖరి కారణంగా కేవలం 177.32 కోట్లు మాత్రమే 2010 ఆర్థిక సం॥ నాటికి ఋణ సౌకర్యం లభించింది. అంతేకాక 9% వడ్డీతో ఇవ్వవలసిన చేనేత ఋణాలకు కోపరేటివ్ / కమర్షియల్ బ్యాంకులు 14% వరకు వడ్డీని వసూలు చేయడం కూడా సహకార సంఘాల ఆర్థిక నష్టాలతో మూత పడటం ప్రధానకారణం.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణను ఎదుర్కొవడానికి మన దేశ భౌగోళిక పరిస్థితులు, ప్రాంతీయ సంస్కృతులను బట్టి సహకార వ్యవస్థ తప్ప పేదలకు మరో ప్రత్యామ్నాయ మార్గం లేదు. సహకారమంటేనే "ఒకరి కోసం అందరూ, అందరి కోసం ఒకరు" అని అర్థం . ఈ భావంలోనే లోక విద్య దాగి ఉంది. లోక విద్యా జ్ఞానం లేకుండా వస్తు ఉత్పత్తికి సంబంధించిన ఏ విధమైన జ్ఞానం కూడా ఒకరి నుంచి మరొకరికి అనుభవపూర్వకంగా అందదు. ఈ అనుభవపూర్వక విద్యే లోక విద్య. ఈ విద్యా జ్ఞానం నుండి పెంపొందినవే ఆధునిక శాస్త్రాలు. ఈ శాస్త్రాలు నేడు అభివృద్ధి పేరుతో శ్రామిక వర్గ దోపిడీ చేస్తూ పేదలను వృత్తికారులను ఉపాధి లేకుండా చేస్తున్నాయి. ప్రకృతి జ్ఞానం నుండి పెంపొందినవే ఆధునిక శాస్త్రాలు. ఈ శాస్త్రాలు నేడు అభివృద్ధి పేరుతో శ్రామిక వర్గ దోపిడీ చేస్తూ పర్యావరణ సమతుల్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఆధునిక యంత్రాలతో పెట్టుబడి కేంద్రీకరించబడి చేనేతలను, వ్యవసాయదారులను చేతివృత్తిదారుల ఉపాధిని పూర్తిగా ధ్వంసం చేస్తూ ఆర్థిక అసమానతలను సృష్టిస్తూ వనరుల పంపిణీలో సమానత్వం లేకుండా చేస్తున్నాయి. వనరుల పంపిణీలో సమానత్వం లేకుండా పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థికాభివృద్ధి జరగదు. ఆర్థిక అసమానతల తొలగింపుకు వనరుల సక్రమ పంపిణీలకు లోకవిద్య సూత్రాలు ద్వారా మాత్రమే సాధ్యం. ఎందువలనంటే లోకవిద్య మానవ సంబంధాలను పెంపొందించి పరస్పర సహకారాన్ని, ఆధారాన్ని కల్గిస్తుంది. అందువలన దోపిడీకి ఎక్కడా అవకాశం ఉండదు. అభివృద్ధి చెందిన అగ్రరాజ్యంలో పని చేస్తున్న మన దేశ పౌరులు 2 కోట్ల మంది తిరిగి మన దేశానికి వచ్చే 3 సం॥లలో వచ్చేయబోతున్నారు. దీనికి అగ్రరాజ్యాలలో సంభవించిన ఆర్థిక సంక్షోభమే ప్రధాన కారణం. మన దేశంలోని విశాల మార్కెట్ అవకాశాలు మెండుగా ఉన్నందున మన దేశీయ ఉత్పత్తులను కాపాడు కోవడం మనం చేయాల్సిన పని. దీని ద్వారా మాత్రమే మనం ఆర్థిక, ఆహార ద్రవ్యోల్బణాలకు బలికాకుండా దేశాభివృద్ధిని నిలబెట్టుకోగలం. స్వావలంబన సాధిస్తాం.

కావున భారతదేశంలో జనాభాలో సగానికి పైగా ఉన్న చేనేత ఇతర చేతివృత్తులవారంతా చిన్న, సన్నకారు రైతాంగంతో కలిసి లోకవిద్యను పరిరక్షించుకుని జీవనోపాధిని భద్రపరుచుకునేందుకు మరోసారి స్వాతంత్ర్య పోరాటంలా ఉద్యమించాల్సిన అవసరం ఎంతో ఉంది. ఈ రంగాన్ని పరిరక్షించటంకోసం ప్రకృతి రక్షణ కోసం అందరూ చేనేత వస్త్రాలను ధరించాలి. **- మాచర్ల మోహనరావు**

# ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయానికి సెలవు ప్రకటన

1991 నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాల్లో భాగంగా ప్రపంచబ్యాంకు భారతదేశానికి ఆర్థిక సహాయం అందించి అనేక షరతులు విధించింది. ఆ షరతుల్లో భాగంగానే వ్యవసాయరంగం మీద కూడా ప్రపంచబ్యాంకు తన దృష్టిని సారించింది. 120 కోట్ల జనాభాగల భారతదేశం వ్యవసాయరంగంలో స్వయం సమృద్ధి సాధించే దిశగా పయనించటం అమెరికా వంటి దేశాలకు కంటగింపుగా మారింది. వ్యవసాయ రంగంలోకూడా మార్పులను కోరుతూ కొన్ని సూచనలు చేసింది. ఆహార పదార్థాలు చాలినంత ఉత్పత్తిచేస్తే తమ ఆహారోత్పత్తులు వరి, గోధుమలకు దిగుమతికి అవకాశంలేకుండా పోతుందని భారతదేశంలో ఆహార ఉత్పత్తులు పంటలు గాకుండా పండ్లు, పూలు, కాయగూరలు లేదా మెట్ట పంటలు పండించాలనే నిబంధనలు కూడా విధించింది.

పైనేపద్యంలో 2011 సం॥రలో ఆంధ్రప్రదేశ్‌ని ధాన్యాగారంగా పిలువబడుతున్న ఉభయగోదావరి జిల్లాల్లో రైతులు ఆశ్చర్యకరంగా 'క్రాప్‌హాలిడే' ప్రకటించారు. సస్యశ్యామలంగా విరజిల్లే గోదావరి జిల్లాలో 'క్రాప్‌హాలిడే' ప్రకటించడానికి కారణాలను విశ్లేషిస్తే ప్రధానంగా మనకు కనిపించే పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, ఉత్పత్తి సాధనాలు
మంచి విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరల దాదాపు గత సంవత్సరంలోనే 300 శాతం అధికంగా పెరిగాయి. దీనికి తోడు వ్యవసాయానికి ఉచిత కరెంటు యిస్తామని వాగ్ధానం చేసిన ప్రభుత్వాధినేతలు అసలు కరెంటే సరఫరా గాకుండా రోజుకు 12 గంటలకు పైగా కోత విధిస్తున్నారు. ప్రాణావసరమైన మందులు, వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు, ప్రాజెక్టులకు అవసరమైన స్టీలు, సిమెంటుతో సహా పారిశ్రామికోత్పత్తులపై దరల నిర్ణయంగాని, లెవీలుగాని లేకపోవటం, వ్యవసాయ ఉత్పత్తి ధరలు పెరిగినప్పుడు నిర్బంధ లెవీ పేరుతో చౌకగా సేకరించటంతో పాటు ధరలు పడిపోయిన రోజున రైతులను గాలికి వదిలివేయటం ప్రభుత్వ అభివృద్ధి నమూనాను సూచిస్తుంది.

(2వ పేజిలో చూడండి)



సదస్సులో ఉద్యమకారులు



మాచర్ల మోహనరావు, చేనేత నాయకులు



ప్రొ॥ కృష్ణరాజులు

# లోక విద్య జన ఆందోళన తొలి అంతర్జాతీయ సదస్సు

## విద్యా ఆశ్రమం - సారనాథ్ - వారణాశి సంక్షిప్త సమాచారము 2011 సం॥ నవంబరు 12వ తారీఖు నుండి 14వ తారీఖు వరకు

ఈ సంవత్సరము నవంబరు 12 నుండి 14వ తారీఖు వరకు 'లోకవిద్య జన ఆందోళన'చే నిర్వహింపబడిన సదస్సు సభాస్థలం స్వచ్ఛంద కార్యకర్తలతో నిండిపోయింది. కనీసం 150 మంది చొప్పున రోజుకు రెండు మార్లు 300 మందితో పైగా చర్చా కార్యక్రమాలు నిర్వర్తించడం జరిగింది. అనూచాన వృత్తులతో తరతరాలుగా జీవనం సాగిస్తున్న రైతులు, చేతి వృత్తులవారు, స్త్రీలు, ఆదివాసీలు, చిన్న వ్యాపారస్తుల నేటి మనుగడ పోరాటాలతో 'లోక జన ఆందోళన' సారూప్యత, ఐక్యతలను గుర్తించడం జరిగింది. ఏ విశ్వ విద్యాలయాల్లో విద్య నేర్వకుండా, సహజ సిద్ధమైన ప్రతిభాపాటవాలతో, పద్ధతులతో, మనుగడ సాధించడం ద్వారానే శాంతియుత సహజీవనం, పర్యావరణ పరిరక్షణ వీలుపడుతుంది. ఈ భావనను గాఢంగా విశ్వసించి బలపరచే సామాజిక కార్యకర్తలు, రైతు సమస్యలపై పోరాడే నాయకులు, రైతులు, చేతి వృత్తులవారు, కళాకారులు, 'లోకవిద్య' దాని అనివార్యతపై చర్చించడం జరిగింది.

సదస్సులో పాల్గొన్నవారు - రాష్ట్రాల, ప్రాంతాల వారీగా - బీహార్ - కొన్ని ప్రాంతాలనుండి, జార్ఖాండ్, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహరాష్ట్ర, మధ్యప్రదేశ్, ఢిల్లీ, పంజాబ్, ఉత్తరప్రదేశ్ మరియు యూరప్. ప్రత్యేకంగా యీ దిగువ తెలిసిన ప్రాంతాలనుండి కార్యకర్తలు రావడం జరిగింది; మధుబని, ధర్భంగా, వైశాలి, గయ, రాంచి, దీఘర్, హజారీబాగ్, కలకత్తా, విజయవాడ, చీరాల, హైదరాబాద్, బెంగుళూరు, పూణె, వార్ధా, నాగపూర్, ఇండోర్, ధర్, మొరైనా, రేవా, సింగ్రులి, ఢిల్లీ, అమృతసర్, అలీగడ్, ముజఫర్‌నగర్, లక్నో, సుల్తాన్‌పూర్, బస్తి, ఫైజాబాద్, అలహాబాద్, జాన్‌పూర్, గోరఖాపూర్, బల్లియా, అజంఘడ్, చందౌలి, ఘాజీపూర్, సోన్‌భద్ర, మీర్జాపూర్, వారణాశి మరియు వియన్నా.

మూడు ముఖ్య విషయాలపై చర్చలు జరపడమైనది. లోకవిద్య ఆవశ్యకత, లోకవిద్యాధారుల సమాజిక జీవనపోరాటాలు, నిర్మాణాత్మక వ్యవస్థలు - సమాచార వ్యవస్థ (కళారూపాలు, భాష, ఆలోచనాసరళి)

ప్రత్యేకంగా చర్చించిన అంశాలు : లోకవిద్యలో యిమిడి ఉన్న ఆత్మగౌరవం, వృత్తిగౌరవం, భూమి, నివాసం, వృత్తులనుండి తొలగించబడటం, ప్రతి లోకవిద్యాధరులందరికి వారి లోకవిద్యపైన ఆధారపడిన ఉద్యోగాల కల్పన, దేశీయ ప్రకృతి వనరుల అందుబాటు, వాటిపై నియంత్రణ, ప్రాథమిక హక్కుగా లోకవిద్యాధారిత జీవనోపాధిని చట్టబద్ధం చేయడం, సంపూర్ణ స్వేచ్ఛా స్వపరిపాలన స్ఫూర్తిగా "లోకవిద్య - జన ఆందోళన"కు విస్తృత ప్రచారం కలిగించే రీతిలో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేయడం.

సమావేశంలో 50 మందికిపైగా "లోకవిద్య-జన ఆందోళన"ను గురించి సందేహాలు, నిర్ణయించబడిన కార్యక్రమాలు అమలు చేయడంలో ఎదుర్కొంటున్న యిబ్బందులు, నూతన తరహా నిర్మాణ ఆలోచనలు, క్రియాశీలక కార్యక్రమాల నిర్వహణ గురించి చర్చించడ జరిగింది. ప్రత్యేకంగా చెప్పవలసిన అంశం ఏమిటంటే ఈ సమావేశంలో పాల్గొన్న "భారతీయ కిసాన్ యూనియన్" రైతు నాయకులు 'లోకవిద్యాజన ఆందోళన'కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించడం అత్యంత ముదావహం.

'విద్యా ఆశ్రమం' సంక్షిప్తంగా 'లోకవిద్య'కు సంబంధించిన ఆలోచన, కార్యాచరణ, గత 20 సంవత్సరాల కృషి, ఈనాడు దాని స్వరూపం, లోకవిద్య జన ఆందోళన ద్వారా ఏది నిజమైన జ్ఞానం అనే సమాచారాన్ని సమాజంలోకి తీసుకువెళ్ళడంలో తమ ప్రయత్నాల్ని సదస్సుకు హాజరైన వ్యక్తులకు వివరించడం జరిగింది.

'లోకవిద్య' భావన ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న 'గ్లోబలైజేషన్' వ్యతిరేక ఉద్యమాలతో ఎలా అంతర్లీనంగా ఉన్నదో ఒక కార్యక్రమంలో చర్చించడం జరిగింది. ఏ రోజుకారోజు జరిగిన చర్చా కార్యక్రమాలపై హాజరైన వారు సాయంత్రం పెద్ద సంఖ్యలో గుమిగూడి విశ్లేషణ జరిపేవారు. సమాచార వ్యవస్థ, కళ, భాష, ఆలోచనా విధానంపై జరిగిన ఒక సదస్సులో, జార్ఖండ్ ఆదివాసీల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, ఆర్థిక, సాంస్కృతిక దోపిడీలకు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేపట్టి ప్రస్తుతం అక్రమ నిర్భందంలో న్యాయస్థానలచే మరణశిక్ష విధించబడ్డ, ప్రాంతీయ కళాకారుడు "జీతన్‌మరాండి"ని బేషరతుగా వెంటనే విడుదల చేయవలసినదిగా తీర్మానించడమైనది.

సిద్ధాంత కార్యాచరణలను దృష్టిలో ఉంచుకొని 'లోక విద్య జన ఆందోళన' కార్యాలయాన్ని ఎక్కడ నెలకొల్పాలనే దానిమీద తీవ్రమైన చర్చలు జరిగాయి. ఆందోళన ప్రాంతాల్లో వాస్తవ పరిస్థితులను అవగాహన చేసికొని మూల సిద్ధాంతంతో దానిని అన్వయించుకోవలసినది. లోకవిద్యాధారులైన భిన్న సమాజాలకు చెందిన వ్యక్తుల బ్రతుకు పోరాటాల మూలం "లోకవిద్య" ద్వారా కల్పింపబడ్డ జ్ఞానమనే స్పృహ వారికి తెలియజేయబడ్డ ప్రదేశాలే లోకవిద్యా కేంద్రాలుగా రూపుదిద్దుకోవాలి. అటువంటి రైతు, ఆదివాసీల జీవన పోరాటాలు ఎక్కడ ఉంటాయో అవే లోకజన ఆందోళన కేంద్రాలుగా ఉంటాయి. జన ఆందోళన కేంద్రాల రూపకల్పన ఒక నూతన నిర్మాణంగాను, సరికొత్త ఆలోచనా విధానాలతో ఏర్పాటు చేయాల్సి ఉందని అందరూ ఏకాభిప్రాయానికి రావడం జరిగింది.

సమావేశంలో ఈ దిగువ తెల్పిన నిర్ణయాలను ఏకగ్రీవంగా ఆమోదించడమైనది.

ప్రస్తుతము హాజరైన భిన్న ప్రదేశాల సమాజాలనుండి ఎన్నిక చేయబడ్డ 22 మంది క్రియాశీలక సభ్యులతో 'లోకవిద్యా జనాందోళన' జాతీయ కమిటి ఏర్పాటు చేయడమైనది. ఈ కమిటీని ముందుముందు విస్తృతపరిచే అవకాశముంది. విద్యాశ్రమము ఒక సంవత్సరంపాటు కార్యక్రమాలను సమన్వయం పరిచే సచివాలయాన్ని పోలి ఉండటం మీరు ఈసారి వచ్చినప్పుడు గమనించగలరు.

ఈ దిగువన తెలిపిన కార్యక్రమాలు నిర్వహించుటకు నిర్ణయించబడినది.

1. లక్నో : 'లోకవిద్య' భావనపై నిర్మాణాత్మక శిబిరం-జనవరి 2011
2. దర్భంగా : లోకవిద్యాసదస్సు - మార్చి 2012
3. విజయవాడ : లోక విద్యా సదస్సు - మే 2012
4. సింగ్రౌలి : లోక విద్యా సదస్సు - ఆగష్టు 2012
5. వార్ధా : లోక విద్యా కార్యక్రమం - అక్టోబరు 2012
6. ఇండోర్ : 3 రోజుల

'లోక విద్యా బజార్ ' కార్యక్రమం - డిశంబర్ - 2012

చివరగా ఈ సదస్సు 'లోక విద్య' అనే భావనను వివిధ రంగాలలోని ప్రజానీకానికి పరిచయం చేయబడ్డది.

**తయారు చేసినవారు :**

**ప్రొ॥ సునీల్, డా॥ సురేంద్రన్ మరియు ప్రొ॥ కృష్ణరాజులు**




టి. నారాయణ రావు, సంపాదకుడు



విజయ్ జావందియ, రైతు నాయకుడు

జ్ఞానం లాభాలకోసం కాదు.
జ్ఞానం లాభాపేక్ష కోసం పరిశ్రమ కారాదు
వ్యక్తిత్వ వికాసానికి సమాజంలో అందరికి ఉపయోగపడేది జ్ఞానం.
జ్ఞానం సమాజంలోనుంచే ఉద్భవిస్తుంది.
జ్ఞానం మానవుడు సంపూర్ణ మానవుడవటానికి దోహదపడాలి.
జ్ఞానం ఏ ఒక్కరి సొత్తు కాదు. ఇతరులను దోచుకోవటానికి పనికొచ్చేది జ్ఞానం కాదు.
అన్ని రకాల విద్యలు, వృత్తులు సమానమే

ఉద్యమ వార్తలు పంపించవలసిన చిరునామా :
Loka Vidya Prapancham
D.No. 10-100, New Gaddiannaram,
Hyderabad - 500 060. Ph : 040-24152155
e-mail : tnrkoundinyasa@yahoo.com

BOOK - POST PRINTED MATTER
JANUARY 1. 2012

To,

______________________

______________________

______________________

______________________

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Hyderabad - 500 060.